సాక్షి
చిత్తూరు

సోమవారం : 20 : మే : 2024



పంటలపై గజరాజుల బీభత్సం

పెద్దపంజాణి, పులిచెర్ల మండలాల్లో శనివారం రాత్రి గజరాజులు పంటలపై దాడి చేసి బీభత్సం సృష్టించాయి. - 8లో



బోసిపోయిన పూలమార్కెట్

ఎప్పుడూ కళకళలాడుతూ, అంతర్జాతీయ ఖ్యాతి గడించిన కుప్పం పూల మార్కెట్ ఆదివారం వెలవెలబోయింది. - 8లో



వరసిద్ధునికి భక్తుల తాకిడి

కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. - 8లో

న్యూస్‌రీల్

కౌంటింగ్ కేంద్రం వద్ద డ్రోన్‌లు నిషిద్ధం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రానికి సరిహద్దులో ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాల (ఎన్నికల కౌంటింగ్ కేంద్రం) వద్ద డ్రోన్‌ల వినియోగం నిషిద్ధం అని జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు ఇటీవల జిల్లా వ్యాప్తంగా జరిగిన సార్వత్రిక ఎన్నికల ఈవీఎంలను ఎస్వీసెట్ కళాశాల కౌంటింగ్ కేంద్రం స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జూన్ 5వ తేదీ రాత్రి 7 గంటల వరకు ఆ ప్రాంతాన్ని నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించినట్లు చెప్పారు. కౌంటింగ్ కేంద్రం ప్రాంతంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఎవ్వరూ డ్రోన్‌లను ఎగుర వేయకూడదని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా డ్రోన్‌లను ఎగురవేస్తే వారిపై కఠిన చర్యలుంటాయని ఆ ఉత్తర్వుల్లో జిల్లా ఎన్నికల అధికారి హెచ్చరించారు.

వరసిద్ధునికి రూ.5 లక్షల విరాళం



అధికారులకు చెక్కు అందజేస్తున్న దాత

చిత్తూరు రూరల్(కాణిపాకం): తిరుపతి జిల్లా పిచ్చాటూరుకు చెందిన మునిశేఖర్ నాయుడు కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి ఆదివారం రూ.5 లక్షల విరాళంగా అందజేశారు. ఆ చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాత కుటుంబానికి అధికారులు ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, అధికారులు కోదండపాణి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాకు రూ.41.35 లక్షలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో ప్రజలకు నీటి సరఫరా కోసం ఎస్‌డీఆర్‌ఎఫ్ నుంచి రూ.41.35 లక్షలు నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఈ మొత్తాన్ని వాడుకోవాలని ఆదేశించింది. జిల్లాలో ట్యాంకర్ల ద్వారా 17 ప్రాంతాలకు రూ.6.97లక్షలు, హయ్యరింగ్ 8 ప్రాంతాలకు రూ.2.93 లక్షలు, డీపెనింగ్ 19 ప్రాంతాలకు రూ.25.80 లక్షలు, ఫ్లాషింగ్ 9 ప్రాంతాలకు రూ.5.65 లక్షల నిధులు వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో క్యూలైన్ ఆక్టోపస్ బిల్డింగ్ వరకు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు 90,721 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 50,599 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.28 కోట్ల ఆదాయం వచ్చింది. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉన్న వారికి 2 గంటల్లో దర్శనమవుతోంది.

భక్తులతో కిటకిటలాడిన బోయకొండ

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు, జంతు సంపద వృద్ధి చెందాలంటూ పలు గ్రామాల ప్రజలు అమ్మవారికి పూజలు చేశారు. ఆలయంలో రద్దీ పెరగడంతో క్యూలన్నీ భక్తులతో కిక్కిరిసి పోయాయి. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనె దీపాలు, డీవెలతో మేళతాళాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. పోలీసులు ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.



విశేష అలంకారంలో అమ్మవారు



గరుడవాహనంపై ఊరేగుతూ కల్యాణ మండపానికి తరలివస్తున్న శ్రీమలయప్పస్వామి



పరిణయం.. పరిపూర్ణం

తిరుమలలో పద్మావతీదేవి పరిణయోత్సవం ఆదివారంతో పరిపూర్ణమైంది. ముందుగా మలయప్పస్వామివారు గరుడునిపై కొలువుదీరి ఊరేగింపుగా నారాయణగిరి ఉద్యానవనంలోని కల్యాణ మండపానికి వేంచేపు చేశారు. అనంతరం వేద పండితులు శాస్త్రోక్తంగా మంగళవాయిద్యాల నడుమ దేవదేవేరుల వివాహ ఘట్టం జరిపించారు. – తిరుమల



శ్రీవారి వాహన సేవలో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి తదితరులు

ఏం చేస్తున్నారు?

"దాడులు జరుగుతుంటే ఏం చేస్తున్నారు.. ముందస్తు సమాచారం ఉంది కదా ఏం చర్యలు తీసుకున్నారు.. విధ్వంసం సృష్టిస్తున్న వారిని ఎందుకు అడ్డుకోలేకపోయారు.. సర్పంచ్ ఇంటిని కాల్చివేస్తున్నా ఎందుకు ఆపలేకపోయారు.. పులివర్తి నానిపై దాడి జరిగిందా...కారుపై మాత్రమే జరిగిందా...నానిపై దాడి జరిగితే దెబ్బలు ఎక్కడ తగిలాయి.. ధర్నా సమయంలో ఆయన బాగానే ఉన్నట్టుగా కనిపించింది కదా...ఆస్పత్రిలో వైద్యులు ఎలాంటి నివేదిక ఇచ్చారు.. వెళ్లిపోతున్నవారిపై గన్‌మెన్ ఎందుకు కాల్పులు జరపాల్సి వచ్చింది.. గాయపడిన యువకుడి పరిస్థితి ఎలా ఉంది...ఎలాంటి సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు" అంటూ సిట్ బృందం పోలీసు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించింది. అరాచక పర్వంలో నిజాలను నిగ్గు తేల్చేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించింది. బాధితులతో మాట్లాడి సమగ్రంగా వివరాలను సేకరించింది.



రామిరెడ్డిపల్లె వాసుల నుంచి వివరాలు సేకరిస్తున్న సిట్ అధికారులు

- పచ్చమూక అరాచకాలను పరిశీలించిన సిట్ బృందం
- క్షేత్రస్థాయిలో బాధితుల నుంచి వివరాలు ఆరా
- దాడుల తీరుతెన్నులపై సమగ్ర విచారణ
- తిరుపతి, చంద్రగిరిలో ఘటనాస్థలాల పరిశీలన
- విధ్వంసం జరుగుతుంటే ఏం చేస్తున్నారని పోలీసులపై ప్రశ్నల వర్షం

తిరుపతి రూరల్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు, ఆ తర్వాత చంద్రగిరి నియోజకవర్గంలో జరిగిన హింసాత్మక ఘటనలపై కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియమించిన సిట్ బృందం ఆదివారం రంగంలోకి దిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ, ఎస్వీయూ పోలీస్‌స్టేషన్, చంద్రగిరి పోలీస్ స్టేషన్, చంద్రగిరి మండలంలోని కూచువారిపల్లె, రామిరెడ్డిపల్లెలో సిట్ బృందం సభ్యులు డీఎస్పీ రవిమనోహరాచారి, సీఐ మురళీధర్ తదితరులు విచారణ చేపట్టారు. జరిగిన ఘటనలు, నమోదైన కేసుల వివరాలను స్థానిక పోలీసు అధికారుల నుంచి సేకరించారు. ఆయా కేసుల్లో బాధితుల నుంచి స్టేట్‌మెంట్‌ను నమోదు చేసుకున్నారు. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గన్‌మెన్ ఈశ్వర్‌ను ఘటనా స్థలానికి తీసుకెళ్లారు. మోహిత్‌రెడ్డి ఎందుకు కూచువారిపల్లెకు రావాల్సి వచ్చింది.. అక్కడ ఆయనను అడ్డుకుంది ఎవరు...మోహిత్‌కు వినీల్‌కు మధ్య వాగ్వాదం ఎందుకు ఏర్పడింది...మోహిత్‌రెడ్డి కారును కాల్చిన పరిస్థితులు, తర్వాత గన్‌మెన్ ఈశ్వర్‌ను, మోహిత్ కారు డ్రైవర్ హరీష్, మాజీ సైనికుడు వేణును కిడ్నాప్ చేసి కొటాలకు తీసుకెళ్లి హింసించింది ఎవరు...అంటూ పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ధర్నా సమయంలో నానికి గాయాలు లేవు కదా..!

పులివర్తి నాని కారుపై దాడి జరిగిన ప్రాంతాన్ని సిట్ బృందం పరిశీలించింది. నాని కారుపై మాత్రమే దాడి జరిగిందా...నానిపై కూడా జరిగిందా అని ఆరా తీసింది. ఆయనపై దాడి జరిగితే ధర్నా సమయంలో తీసిన వీడియోల్లో నాని బాగానే ఉన్నట్లు కనిపించింది కదా అని ప్రశ్నించింది .ధర్నా తర్వాత ఆయనకు ఎందుకు అస్వస్థత కలిగింది..వైద్యులు రిపోర్టు ఏమని ఇచ్చారు అంటూ వివరాలు సేకరించింది.

నాని గన్‌మెన్ మెడకు కాల్పుల ఉచ్చు!

పద్మావతి మహిళా వర్సిటీలో కాల్పులు జరిపిన పులివర్తి నాని గన్‌మెన్ ధరణి మెడకు ఉచ్చు బిగుస్తోంది. కారుపై దాడి తర్వాత వెనుతిరిగి వెళుతున్న వారిపై కాల్పులు జరపాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని సిట్ బృందం ప్రశ్నించింది. లాఠీచార్జి, ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా ఫైర్ ఎందుకు ఓపెన్ చేయాల్సి వచ్చింది.. ఇంతకీ కాల్పులు జరిపింది గన్‌మన్‌నేనా.. పులివర్తి నాని చేశాడా అనే వివరాలను ఆరా తీసింది. నాని అన్న కాల్పులు ఓపెన్ చేశాడనే ఆడియో, వీడియోలను పరిశీలించింది. గన్‌మన్ కాల్పుల్లో గాయపడిన యువకుడి పరిస్థితి ఎలా ఉంది..అతని నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారా... అంటూ పోలీసు అధికారులను ప్రశ్నించింది.

ఆధారాలను అందించిన బాధితులు

కూచువారిపల్లెలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని అడ్డుకోవడమే కాకుండా గన్‌మన్, డ్రైవర్‌ను కిడ్నాప్ చేసి కొట్టడం, మోహిత్‌రెడ్డి కారును పెట్రోల్ పోసి కాల్చడం, మరో కారును ధ్వంసం చేయడం, రామిరెడ్డిపల్లి సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిని పెట్రోల్ పోసి కాల్చివేయడం, ఇంట్లో విలువైన వస్తువులను దోచుకున్న వైనం, పులివర్తి నాని స్వయంగా వేలాది మందితో వచ్చి గ్రామంలో అలజడి సృష్టించిన వీడియో, ఆడియో ఆధారాలను బాధితులు సిట్ బృందానికి అందించారు. పద్మావతి మహిళా వర్సిటీ వద్ద దాడి జరిగిన సమయంలో పులివర్తి నానికి ఎలాంటి గాయాలు కాలేదని, కేవలం ఆయన కారుపై మాత్రమే దాడి జరిగిందని, ఘటన తర్వాత నిక్షేపంగా ఉన్న నాని, సానుభూతి కోసమే ఆస్పత్రి డ్రామా ఆడారంటూ రామచంద్రాపురం జెడ్పీటీసీ సభ్యులు ఢిల్లీరాణి వీడియో ఆధారాలను అందించారు. కేవలం ఐదుగురు కారుపై దాడి చేస్తే 150 మందిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారంటూ పలువురు సి.రామాపురం మహిళలు సిట్ బృందానికి ఫిర్యాదు చేశారు.



మోహిత్‌రెడ్డి గన్‌మెన్‌ను విచారిస్తున్న సిట్ అధికారులు

సర్పంచ్ ఇల్లు పరిశీలన

చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లె పంచాయతీ కూచువారిపల్లెలో టీడీపీ మూకలు పెట్రోలు పోసి కాల్చివేసిన సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిని సిట్ బృందం పరిశీలించింది. అసలు ఇంటిని కాల్చాల్సిన పరిస్థితులు ఎందుకు వచ్చాయి అని గ్రామస్తులను ఆరా తీసింది. పులివర్తి వినీల్ ముందుగా గ్రామంలోకి వచ్చాడని, తర్వాత మోహిత్‌రెడ్డి వచ్చిన తర్వాత విషయం తెలుసుకుని పులివర్తి నాని వేలాది మంది రౌడీలతో చేరుకున్నాడని గ్రామస్తులు వెల్లడించారు. అనంతరం రామిరెడ్డిపల్లె పోలింగ్ బూత్ వద్ద జరిగిన ఘటనను సిట్ బృందం విచారించింది.



రాడ్‌తో దాడి చేసినా సీఐ ఎందుకు ఫిర్యాదు చేయలేదు?

కీలకమైన స్ట్రాంగ్ రూమ్ ఉన్న శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ముందు వేలాది మంది గుమికూడి ఆందోళన చేస్తుంటే వద్దని వారించిన తిరుపతి రూరల్ సీఐ తమీమ్ అహ్మద్‌పై చిత్తూరు నుంచి వచ్చిన పులివర్తి నాని అనుచరులు రాడ్‌తో దాడి చేశారు. సీఐ తలపై బలంగా కొట్టడంతో రక్తగాయాలు అయ్యాయి. అడ్డుకున్న కానిస్టేబుల్‌ను సైతం గొంతుపట్టుకుని చంపేందుకు యత్నించారు. యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ సీఐపై కూడా దాడికి యత్నించారు. రక్తగాయాలు అయిన సీఐ కూడా ఎందుకు ఫిర్యాదు ఇవ్వలేదని సిట్ బృందం ఆరా తీసింది. నాని బెదిరింపులతోనే సీఐ ఫిర్యాదుపై వెనక్కితగ్గినట్లు సమాచారం.



సీఐపై దాడి చేస్తున్న టీడీపీ గూండాలు (ఫైల్)

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



పరీక్షలకు హాజరైన విద్యార్థులను తనిఖీ చేసి లోనికి పంపుతున్న టీచర్లు (ఫైల్)



సప్లిమెంటరీ పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన డెస్కులు

- ఈ నెల 24 నుంచి జూన్ 3 వరకు సప్లిమెంటరీ పరీక్షలు
- జిల్లాలో 15 పరీక్ష కేంద్రాల ఏర్పాటు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా 2023–24 విద్యా సంవత్సరంలో పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఈ పరీక్షలకు రాష్ట్ర విద్యాశాఖ పరీక్షల షెడ్యూల్‌ను జారీచేసింది. ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సప్లిమెంటరీ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేపట్టారు. గతంలో పదోతరగతి విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాసినట్లైతే వారి సర్టిఫికెట్లపై సప్లిమెంటరీ అని నమోదయ్యేది. కానీ ఇప్పుడు ఆ విధానాన్ని ఎత్తివేశారు. గతంలో మాదిరి కాకుండా రెగ్యులర్ విద్యార్థుల్లాగానే వారిని పరిగణించనున్నారు. జిల్లా వ్యాప్తంగా సప్లిమెంటరీ పరీక్షలకు 15 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆ కేంద్రాల్లో అన్ని మౌళిక వసతుల కల్పనలో నిమగ్నమయ్యారు.

ప్రత్యేక శిక్షణ

పబ్లిక్ పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు గతేడాది మాదిరిగానే ఆయా పాఠశాలల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం నిర్వహించే సప్లిమెంటరీ పరీక్షల్లో ఆ విద్యార్థులను ఉత్తీర్ణులు చేసేలా శిక్షణ ఇస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఆయా సబ్జెక్టులను చెందిన టీచర్లు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. సులువుగా ఉత్తీర్ణత చెందేలా మెలకువలను నేర్పిస్తున్నారు. ఇప్పటికే సప్లిమెంటరీ విద్యార్థులకు హాల్‌టికెట్లను ఆయా పాఠశాలలకు చేరాయి. హెచ్‌ఎంలు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసి సంతకం చేసి విద్యార్థులకు జారీచేయనున్నారు.

పరీక్షలకు 2006 మంది విద్యార్థులు

జిల్లా వ్యాప్తంగా మార్చి 18వ తేదీ నుంచి పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు నిర్వహించారు. జిల్లా నుంచి 20,939 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాశారు. వారిలో 19,113 మంది ఉత్తీర్ణత చెందారు. 1826 మంది పరీక్షల్లో ఫెయిల్ అయ్యారు. వారితో పాటుగా గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులతో కలిపి మొత్తం 2006 మంది విద్యార్థులు ఈ నెల 24న నిర్వహించే సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకానున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ పరీక్షలను ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇన్విజిలేటర్ల నియామకాలను జిల్లా విద్యాశాఖ అధికారులు చేపడుతున్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేశాం



పది సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశాం. ఈ నెల 24వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం అవుతాయి. పరీక్షల నిర్వహణకు 15 కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరీక్షలను సజావుగా పకడ్బందీగా నిర్వహిస్తాం. పరీక్షలు తప్పిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉత్తీర్ణులయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతోంది.

– దేవరాజు, డీఈఓ, చిత్తూరు

ఉచిత వేసవి శిక్షణ తరగతులు

- గ్రంథాలయాల్లో ప్రారంభమైన విజ్ఞాన శిబిరాలు
- జూన్ 7వరకు తరగతుల నిర్వహణ

కార్వేటినగరం: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఏటా వేసవి సెలవుల్లో శిక్షణ శిబిరాలు నిర్వహించేవారు. కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో 2020–21లో రెండేళ్లపాటు రద్దు చేశారు. 2022 నుంచి యథావిధిగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది గత నెల 29వ తేదీ నుంచి నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయి. అయితే పెరిగిన ఉష్ణోగ్రతలు, ఎన్నికల నేపథ్యంలో శిక్షణ తరగతులు వాయిదా వేశారు. ఈ నెల 15వ తేదీ నుంచి శిక్షణ శిబిరాలు ప్రారంభించారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల సమయం వృథా కాకుండా వారిలో పఠనాశక్తిని కలిగించడం, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులను ఆకట్టుకునేలా వివిధ అంశాలపై 40 రోజుల శిక్షణ ఇచ్చేందుకు మార్గదర్శకాలు జారీ అయ్యాయి. జూన్ 7వ తేదీ వరకూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహించనున్నారు. పూర్తి వివరాలకు సమీప గ్రంథాలయాలను సంప్రదించాల్సి ఉంటుంది. వివిధ సంస్థలకు చెందిన నిపుణులు, తరగతులు నిర్వహిస్తారు.

రెండు విభాగాల్లో నిర్వహణ

పఠనం, సరదా అనే రెండు విభాగాల్లో శిక్షణ ఉంటుంది. పుస్తకపఠనం, కథలు చెప్పించడం, ప్రముఖులతో అవగాహన సదస్సులు, ఆటలపై ఆసక్తి ఉన్నవారికి చెస్,క్యారమ్స్ వంటివి నేర్పిస్తున్నారు. విజేతలకు పుస్తకాలతో పాటు కవులు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత విశేషాలు, వివిధ దినపత్రికలు, చిన్నారులకు ఉపయోగపడే పుస్తకాలు గ్రంథాలయాల్లో ఏర్పాటు చేశారు. నృత్యం, పప్పెట్ల తయారీ వంటి వాటిపై శిక్షణ ఇవ్వవచ్చని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

సేవలకు అవకాశం

పేద విద్యార్థులకు స్వచ్ఛంద సేవ చేయాలనుకునే వారికి ఇది మంచి అవకాశం. స్పోకెన్ ఇంగ్లీష్, చెస్, డ్రాయింగ్, తెలుగులో మంచి ప్రతిభ ఉన్నవారు ఈ గ్రంథాలయాల ద్వారా స్వచ్ఛందంగా సేవలు అందించేందుకు గ్రంథాలయ సంస్థ అవకాశం కల్పిస్తోంది. వేసవిలో ఇలాంటి సేవ ద్వారా ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేందుకు ఆస్కారం ఉంటుంది.



విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయ అధికారి శంకర్‌బాబు

సద్వినియోగం చేసుకోవాలి



వేసవి సెలవుల్లో విద్యార్థులకు గ్రంథాలయాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహించడానికి ఆదేశాలు వచ్చాయి. ఒక్కొక్క కేంద్రానికి రూ.10 వేలు బడ్జెట్ కేటాయించారు. గత ఏడాది విజయవంతంగా నిర్వహించాం. విద్యార్థులు అధికంగా సెల్‌ఫోన్లకే సమయం కేటాయించి చిన్న వయసులోనే కళ్లజోళ్లతో కనిపిస్తున్నారు. వేసవి సెలవుల్లో పిల్లలు గ్రంథాలయాలకు వచ్చేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. విద్యార్థుల ఫోన్ నంబర్లు సేకరించి నిత్యం శిక్షణకు వచ్చేలా చూడాలని సిబ్బందిని ఆదేశించాం. ఆసక్తి గల ఉపాధ్యాయులు, చిత్రలేఖనం, వృత్తి శిక్షణ పొందిన వారు గ్రంథాలయాల్లో విద్యార్థులకు సమయం కేటాయించేందుకు ముందుకు రావాలి.

– ఆర్.వీ.ఆర్.ఎస్.ఎస్ శర్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

బోసిపోయిన కుప్పం పూలమార్కెట్



పూలు లేక వెలవెలబోయిన కుప్పం పూల మార్కెట్

కుప్పంరూరల్: దక్షిణ భారతదేశంలో కుప్పం పూల మార్కెట్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడ పండే పూలు ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్ వంటి దేశాలతో పాటు దేశీయంగా ముంబాయి, ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు రవాణా అవుతుంటాయి. ఇటీవల క్రమంగా విదేశాలకు ఎగుమతి నిలిచిపోయింది. ప్రస్తుతం దేశీయంగా నగరాలకు ఎగుమతి చేస్తున్నారు. అలాంటి మార్కెట్‌లో ఆదివారం పూలు లేకపోవడంతో మార్కెట్ వెలవెలబోయింది. కుప్పం ప్రాంతంలో శుక్ర, శనివారాల్లో ఓ మోస్తరు వర్షాలు నమోదు కావడంతో రైతులు పూలు కోయలేకపోయారు. దీనికి తోడు వర్షాభావ పరిస్థితుల కారణంగా పూల దిగుబడి సైతం తగ్గింది. వెరసి ఆదివారం మార్కెట్‌లో పూలు లేక ఎన్నడూ లేని విధంగా కళావిహీనంగా మారింది. మల్లె, చామంతి, బంతి, కాగడాలు, రోజాలు, జాజులు, దేరాలు వంటి రకరకాల పూలతో కళకళలాడే మార్కెట్ ఆదివారం కేవలం బంతి పూలతో దర్శనమిచ్చింది. దీంతో జనం పూల కొనుగోలుకు వచ్చి నిరాశగా తిరిగి వెళ్లారు. మంగళ, బుధవారాల్లో కుప్పంలో ప్రసిద్ధి చెందిన తిరుపతి గంగమ్మ జాతర ఉండడంతో మార్కెట్‌కు కళ వస్తుందని వ్యాపారులు, రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఫలితాలపై కోట్లల్లో బెట్టింగులు

- అభ్యర్థుల మెజారిటీలపై భారీగా బెట్టింగులు
- కుప్పంలో చంద్రబాబు కష్టమేనంటూ పందెం
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రూ.50 కోట్లు
- కర్ణాటకలో మరో రూ.50 కోట్ల బెట్టింగులు



పలమనేరు: గతంలో ఎన్నడూ లేనంత ఉత్కంఠ రేపిన ఏపీ సార్వత్రిక ఎన్నికలపై సర్వత్రా టెన్షన్ నెలకొన్న నేపథ్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు పొరుగునే ఉన్న కర్ణాటకలోనూ అభ్యర్థుల గెలుపోటములు, ఏపీలో అధికారంలోకి వచ్చే పార్టీలపై బెట్టింగులు జోరందుకున్నాయి. ఎన్నికలకు ముందు సైతం బెట్టింగులు సాగినా ఎన్నికలు ముగిశాక ఓటింగ్ సరళిని బట్టి మరోసారి బెట్టింగులు ఊపందుకున్నాయి. గ్రామీణ స్థాయిలో బూత్‌ల మెజారిటీలనుంచి మండలాల్లో మెజారిటీ, టౌన్లలో పరిస్థితి, ఆయా నియోజకవర్గాల్లో గెలిచే ఎమ్మెల్యేలు, వారి మెజారిటీ, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేపార్టీకి ఎన్ని సీట్లు దక్కుతాయనే విషయంగా సామాన్య ప్రజలే కాకుండా బాగా డబ్బున్న నేతలు, పారిశ్రామికవేత్తలు, రియల్టర్లు సైతం కోట్లల్లో బెట్టింగులకు పాల్పడినట్టు తెలుస్తోంది. కొందరైతే భూములను, మరికొందరు వాహనాలను, వేసుకున్న బంగారాన్ని సైతం బెట్టింగ్ వేసినట్టు తెలిసింది. ముఖ్యంగా కుప్పంలో చంద్రబాబుకు అనూహ్యంగా ఓటమి తప్పదని సైతం భారీగా బెట్టింగులు సాగగా, ఒక వేళ గెలిస్తే ఆయనకు పదివేల మెజారిటీ సైతం రాదంటూ కొందరు రాజకీయాలకు సంబంధం లేని వారు సైతం కర్ణాటకలో బెట్టింగులు కాచినట్టు సమాచారం. ఏదేమైనా జూన్ 4న వెలువడే ఎన్నికల ఫలితాల దాకా బెట్టింగుల గోల తప్పేట్టు లేదు. ఉమ్మడి జిల్లాతోపాటు పొరుగునే ఉన్న కర్ణాటకలో ఇప్పటికే ఎన్నికలపై బెట్టింగులు వందకోట్లను దాటినట్టు తెలుస్తోంది.

సీఎం పీఠంపై..

ఈ దఫా ఏపీలో వంద స్థానాల్లోనైనా వైఎస్సార్‌సీపీ గెలిచి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమని ఎక్కువ మంది బెట్టింగులకు పాల్పడినట్టు తెలుస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రధాన పార్టీలకు ఏడేసి అసెంబ్లీ స్థానాలు రానున్న నేపథ్యంలో రాయలసీమలోనే ఫలితాలు కూటమికి అనుకూలంగా ఉన్నప్పుడు కోస్తాలో భారీగా టీడీపీకి స్థానాలొస్తాయి కాబట్టి ఖచ్చితంగా కూటమిదే విజయమంటూ టీడీపీ శ్రేణులు భారీ బెట్టింగులు వేసినట్టు తెలిసింది. తాజాగా ఐప్యాక్ టీంతో కలసి సీఎం భారీ విజయం వైఎస్సార్‌సీపీదేనంటూ ప్రకటించడంతో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులు సైతం భారీగానే పందేలకు దిగుతున్నట్టు తెలుస్తోంది.

కుప్పంలో చంద్రబాబు ఓటమిపై..

గత అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబు 30వేలపై చిలుకు మెజారిటీతో గెలిచారు. అయితే కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన దొంగ ఓటర్లను తొలగించడంతో టీడీపీకి మెజారిటీ రాదని వాదించేవారు లేకపోలేదు. మరోవైపు ఇటీవల కుప్పంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో, మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుతో బెట్టింగ్‌రాయుళ్లు చంద్రబాబు ఓటమిపై ధీమాగా భారీగా బెట్టింగులకు దిగినట్టు తెలుస్తోంది. కుప్పంలో చంద్రబాబు మెజారిటీపై సైతం ఉమ్మడి జిల్లాతో పాటు కడపలో ఎక్కువగా బెట్టింగులు సాగినట్టు తెలుస్తోంది. ఈ దఫా చంద్రబాబు గెలిచినా పదివేల లోపేనని కొందరు, ఐదు వేల లోపు బయటపడతారని మరికొందరు లక్షల్లో పందేలు కాసినట్టు తెలుస్తోంది.

ఆయా నియోజకవర్గాల్లో..

పలమనేరులో అమరనాథ రెడ్డి గెలుస్తారని కొందరు, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెంకటేగౌడ 5వేలలోపు మెజారిటీతో గెలుస్తారని బెంగళూరులోనే రూ.2 కోట్ల దాకా బెట్టింగులు సాగినట్టు తెలిసింది. ఈ విషయమై కర్ణాటకలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు సైతం భారీగా బెట్టింగులకు దిగినట్టు అక్కడి వారే చెబుతున్నారు. ఇక పూతలపట్టులో ఫైట్ నువ్వానేనా అని ఉందని దీంతో ఇరుపార్టీల అభ్యర్థుల్లో ఎవరు గెలిచినా మెజారిటీ 5వేల లోపేనంటూ బెట్టింగులు సాగాయి. జీడీ నెల్లూరులో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని భారీగా బెట్టింగులు సాగాయి. ముఖ్యంగా చిత్తూరులో ఇరుపార్టీ అభ్యర్థులపై కోట్లలో బెట్టింగులు జరిగాయట. చంద్రగిరిలో వైఎస్సార్‌సీపీ తప్పకుండా గెలుస్తుందని కొందరు, కాదు టీడీపీయేనంటూ మరికొందరు, తిరుపతిలో జనసేన విజయం తప్పదంటూ పలువురు వ్యాపారులు బెట్టింగులకు పాల్పడినట్టు తెలుస్తోంది. శ్రీకాళహస్తిలో వైఎస్సార్‌సీపీ గెలుపుపై బెట్టింగులు సాగాయి. ఇక మదనపల్లిలో పోరు రసవత్తరంగా ఉండడంతో ఇరు పార్టీలపై భారీగానే పందేలు సాగాయి. ముఖ్యంగా పీలేరులో టీడీపీ గెలుస్తుందని కాంగ్రెస్ నాయకులు సైతం పందేలు కట్టారట. తంబళ్లపల్లిలోనూ జోరుగా పందేలు సాగినట్టు తెలుస్తోంది. నగరిలో రోజమ్మ గెలుపు, ఓటములపై చెన్నైలోనూ బెట్టింగులు జరిగినట్టు తెలిసింది.

గ్రామాల్లో బూత్‌ల మెజారిటీలపై

ఇక పల్లెల్లో ఆయా బూత్‌లో ఏ పార్టీకి మెజారిటీ వస్తుందనే దానిపై వేలనుంచి లక్షల్లో పందేలు కాసినట్టు క్షేత్రస్థాయిలో తెలుస్తోంది. ఇందుకు సంబంధించి కొందరు తమ బైక్‌లను, మెడగొలుసు, చేతిలోని ఉంగరాలను సైతం బెట్టింగులపై పెట్టారట. సామాన్య ప్రజలు సైతం పందెంలో ఓడితే గుండు కొట్టించుకుంటామని, ఒంటిమీసం పెట్టించుకుంటానని, గాడిదపై ఊరేగుతానంటూ శపథం చేయడం కొసమెరుపు.

భారీగా పెరిగి పోలింగ్, మహిళల ఓట్లే కీలకం

ఉమ్మడి జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ దఫా ఎన్నికల్లో భారీగా పోలింగ్‌నమోదైంది. ముఖ్యంగా బయటి రాష్ట్రాలనుంచి, విదేశాలనుంచి సైతం ఓటర్లు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో పాటు మహిళా ఓటర్ల పోలింగ్ ఎక్కువగా జరిగింది. దీంతో ఇరు పార్టీలకు వీరే నిర్ణయాత్మకంగా మారారు. కొన్ని బూత్‌లలో అర్ధరాత్రి వరకూ పోలింగ్ జరిగింది. వీరంతా వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఓటేశారని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. పెరిగిన ఓటింగ్ ప్రభుత్వంపై వ్యతిరేకతేనంటూ టీడీపీ చెబుతోంది. రాజకీయ విశ్లేషకులు సైతం ఖచ్చితంగా పార్టీ గెలుపోటములను డిసైడ్ చేయని పరిస్థితుల కారణంగానే ఓ దఫా బెట్టింగులో ఈ స్థాయిలో సాగినట్టు తెలుస్తోంది. ఏదేమైనా ఎన్నికల ఫలితాలు వచ్చేదాకా బెట్టింగ్‌రాయుళ్లకు నిద్రలేని రాత్రులు తప్పేలా లేవు. ఎన్నికల్లోపోటీ చేసిన అభ్యర్థులకంటే వీరికే ఎక్కువగా టెన్షన్ ఉన్నట్టు సమాచారం.

ఇదిగో సాక్ష్యాలు....

- బెంగళూరుకు చెందిన వ్యాపారి శీను రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందంటూ తన ఇంటి స్థలాల(సైట్ల)ను పందెం వేశాడు.
- కడపకి చెందిన ఓ మైనింగ్ వ్యాపారి కుప్పంలో చంద్రబాబుకు పదివేల మెజారిటీ రాదని ఏకంగా రూ.50లక్షల బెట్ కట్టినట్లు తెలిసింది.
- పలమనేరు నియోజకవర్గానికి చెందిన ఓ రియల్టర్ బెంగళూరులోని తన అపార్ట్‌మెంట్‌ను బెట్ కట్టి పలమనేరులో వెంకటేగౌడ గెలుస్తాడని బెట్‌కు అగ్రిమెంట్లు కూడా జరిగాయట.
- పలమనేరుకు చెందిన ఓ హోటల్ యజమాని మాజీమంత్రి అమర్‌కు 50వేల మెజారిటీ వస్తుందని రూ.5లక్షలు బెట్ కట్టినట్టు చర్చ నడుస్తోంది.
- పట్టణ సమీపంలోని మన్నార్‌నాయునిపల్లికి చెందిన పాలవ్యాపారి పలమనేరులో ఖచ్చితంగా వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని తన పొలం పాసుపుస్తకాలను బెట్ కట్టినట్టు తెలిసింది.
- ఇప్పటిదాకా బెంగళూరులో ఐపీఎల్ బెట్టింగులు చేసే ముఠాలు ఏపీ ఎన్నికలపై కోట్లలో బెట్‌లు వేసినట్టు తెలుస్తోంది.
- ఏదేమైనా సామాన్య ప్రజలనుంచి కోటీశ్వరుల దాకా వారి స్థాయిని బట్టి ఎన్నికల ఫలితాలపై బెట్టింగులు ఈ స్థాయిలో పాల్పడడం ఇదే తొలిసారని జనం చర్చించుకోవడం విశేషం.

రైలు నుంచి పడి ఆర్మీ సుబేదార్ మృతి





మృతి చెందిన చంద్రశేఖర్ రెడ్డి, మృతుడు (ఫైల్)

పెనుమూరు(కార్వేటినగరం): రైలు నుంచి పడి ఆర్మీ సుబేదార్ చంద్రశేఖర్‌రెడ్డి మృతి చెందిన సంఘటన ఉత్తరాఖండ్‌లోని రాంపూర్ రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెనుమూరు మండలం కనికాపురానికి చెందిన కె.సుబ్రమణ్యంరెడ్డి కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి(42) ఉత్తరాఖండ్‌లోని డాచ్చుల్లాలో ఆర్మీ సుబేదార్‌గా పని చేస్తున్నారు. గత నెల 15 నుంచి సెలవు పెట్టి స్వగ్రామానికి వచ్చారు. సెలవులు ముగియడంతో ఈ నెల 16వ తేదీ గురువారం రాత్రి చిత్తూరు నుంచి ట్రైన్‌లో బయలుదేరాడు. శనివారం ఉదయం 3.30 గంటలకు ఉత్తరాఖండ్ రాష్ట్రం రాంపూర్ రైల్వేస్టేషన్ సమీపంలో ట్రైన్ నుంచి ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. చంద్రశేఖర్ రెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు సైనిక లాంఛనాలతో చిత్తూరులోని మురకంబట్టు అపోలో కాలనీలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కారు- బైక్ ఢీ: ఐదుగురికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురై దెబ్బతిన్న వాహనాలు

వి.కోట: కారు బైక్ ఢీకొని ఐదుగురికి తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు మండలంలోని బంగ్లాఊరుకు చెందిన వీరభద్ర పేర్నంబట్ వైపు కారులో బయల్దేరాడు. గుమ్మిరెడ్డిపల్లెకు చెందిన ఆనంద్ ఆయన భార్య హేమావతి, కుమారులు వైభవ్, నేహంత్ తమ బైక్‌పై వి.కోట వైపు బయల్దేరారు. ఈ క్రమంలో మండలంలోని వి.కోట- పేర్నంబట్ జాతీయరహదారిలోని బంగ్లాఊరు గ్రామం వద్ద ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. దీంతో ఆనంద్ కుటుంబ సభ్యులు నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా వి.కోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం క్షతగాత్రులను కుప్పం పీఈఎస్‌కు తరలించారు.

గాయపడిన ట్రాక్టర్ డ్రైవర్ మృతి



మృతి చెందిన నాగభూషణం

బంగారుపాళెం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ట్రాక్టర్ డ్రైవర్ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని మొగిలి వద్ద ఈ నెల 15వ తేదీ రాత్రి చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కీరమంద గ్రామానికి చెందిన ఆరుగురు ట్రాక్టర్‌పై వరిగడ్డి తరలిస్తూ రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. అందులో ఇద్దరు మృతి చెందగా, నలుగురు తీవ్రంగా గాయపడి తిరుపతిలో చికిత్స పొందుతున్నారు. వారిలో కీరమందకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ నాగభూషణం(36)తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు, కుమారుడు ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పిడుగు పడి వ్యక్తి మృతి



మృతుడు అన్బుకుమార్

పుత్తూరు: మండలంలోని కృష్ణసముద్రం గ్రామానికి చెందిన సి.అన్బుకుమార్(45) పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. ఈ సంఘన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వర్షం పడుతుండగా రామసముద్రం చెరువు వద్ద ఆవులు మేపుతున్న అన్బుకుమార్ సమీపంలో పిడుగు పడడంతో అపస్మారక స్థితికి వెళ్లాడు. చుట్టుపక్కల వారు వెంటనే నగరి ఏరియా ఆస్పత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతుడికి పెళ్లి కాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పంటలపై గజరాజుల బీభత్సం



ఏనుగులు విరిచేసిన మామిడి కొమ్మలు

పెద్దపంజాణి: మండలంలోని పలు గ్రామాల పంట పొలాలపై శనివారం రాత్రి ఏనుగులు బీభత్సం సృష్టించాయి. ఆదివారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు ధ్వంసమైన పంటలు చూసి ఆవేదన వ్యక్తం చేశారు. కీలపట్ల ఫారెస్టు బీటు నుంచి వచ్చిన ఏనుగులు ముదిరెడ్డిపల్లెలోని టీజీ సుబ్రమణ్యంకు చెందిన మామిడి, పనస చెట్లను విరిచేశాయి. అదే గ్రామానికి చెందిన అగిస్తి టమాట పంటను తొక్కి నాశనం చేశాయి. జిట్టంవారిపల్లె రైతులకు చచెందిన మొక్కజొన్న పంటలను తినేశాయి. ఈ దాడుల్లో సుమారు రూ.50 వేల మేరకు నష్టం జరిగినట్లు అంచనా. ఏనుగుల దాడుల్లో దెబ్బతిన్న పంటలను రాయలపేట ఫారెస్టు బీటు ఆఫీసర్ రవికుమార్ పరిశీలించారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపి నష్టపరిహారం మంజూరుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పదేపదే పంటలపై దాడులు

పెద్దకాప్పల్లి పంచాయతీ పరిధిలోని అటవీ సరిహద్దు గ్రామాలైన కొత్తబూరగపల్లి, తిప్పిరెడ్డిపల్లి, పెద్దకాప్పల్లి, పెనుగొలకల, ముదిరెడ్డిపల్లి, గౌరీనగర్, జిట్టంవారిపల్లి, ఆకులవారిపల్లి రైతులకు చెందిన పొలాల్లోకి ఏనుగుల గుంపు పదేపదే చొరబడుతూ పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. చేతికొచ్చిన పంట ఏనుగుల వల్ల నష్టపోతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులు పంటలపైకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని చల్లావారిపల్లెలో ఆదివారం తెల్లవారు జామున పంట పొలాలపై ఏనుగుల గుంపు దాడి చేసి మామిడి కొమ్మలను విరిచేశాయి. వెంకటరమణ మామిడితోటలో గేటు కూడా విరిచేశాయి. దాదాపు 7 ఏనుగులు ఈ పల్లె పరిసర ప్రాంతాల్లోని పొలాల్లో సంచరించాయి. వర్షం పడడంతో ఏనుగుల అడుగులను పొలాల్లో రైతులు గుర్తించారు.

సేద్యం.. సన్నద్ధం

తిరుపతి అర్బన్ : వరుణుడి కరుణతో పుడమి పులకించింది. జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు వర్షాలు కురుస్తుండడంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో 65,250 హెక్టార్లలో పంటల సాగు చేపట్టనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. పలు ప్రాంతాల్లో రైతులు పొలాలను దుక్కిదున్నుతున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం కూడా సబ్సిడీపై విత్తనాలు, ఎరువులను సిద్ధం చేసింది. అన్నదాతలు సైతం విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రాలకు(ఆర్బీకే) వెళ్లి తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. ఈ పక్రియ జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని ఆర్బీకేల్లో మొదలైంది. ముందుస్తుగానే ప్రభుత్వం సైతం విత్తనాలను రైతు భరోసా కేంద్రాలకు సరఫరా చేసింది. 50శాతం సబ్సిడీతో జీలగలు, జనుములు, పిలిపెసర, 40శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు అందించేందుకు చర్యలు చేపట్టింది. మరోవైపు ఎరువుల సరఫరాపై కూడా అధికారులు దృష్టి పెట్టారు.

పెట్టుబడి సాయం కోసం ఎదురుచూపు

పంటల సాగు చేసే సమయంలో రైతులు ఆర్థిక ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ఖరీఫ్ సాగు ముందే ఏటా అన్నదాతల ఖాతాల్లో రైతు భరోసా కింద రూ.5,500 చొప్పున పెట్టుబడి సాయం జమ చేస్తోంది. అయితే ఈసారి ఎన్నికల నేపథ్యంలో వీటిని జమ చేస్తారా, లేదా? అని రైతులు ఆందోళన చెందుతున్నారు. పథకాల సొమ్ములను జమ కాకుండా ఆపాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి అడ్డుకున్న ప్రతిపక్ష పార్టీలు.. ఇప్పుడైనా రైతు భరోసా నిధులు విడుదల చేయనిస్తారా, లేదా? అన్నది వేచి చూస్తున్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

రామకుప్పం: ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, పెద్దకురబలపల్లికి చెందిన వెంకటేష్(37) తోపుడు బండిపై కూరగాయల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం రాత్రి వ్యాపారం ముగించుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. ఆనిగానూరు గ్రామ సమీపంలో విజలాపురం నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు తోపుడు బండితోపాటు వెంకటేష్‌ను ఢీకొంది. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించగా మార్గ మధ్యంలో వెంకటేష్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివకుమార్ వెల్లడించారు.

వివాహిత ఆత్మహత్య



సుమిత్ర(ఫైల్)

రామకుప్పం: అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో ఆదివారం వెలుగుచూసింది. ఎస్‌ఐ శివకుమార్ కథనం మేరకు, కుప్పం మండలం పెద్దవంక గ్రామానికి చెందిన సుమిత్ర(24)కు మండలంలోని లక్ష్మీనగర్‌కు చెందిన పెరుమాళ్‌కు ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు మగ సంతానం. ఇటీవల భర్త, అత్త నుంచి సుమిత్రకు వేధింపులు ఎక్కువకావడంతో బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. శవాన్ని బయటకు తీసి కుప్పం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు.

మహిళకు తీవ్ర గాయాలు

బంగారుపాళెం: వరి నూర్పిడి యంత్రంలో తల చిక్కుకుని మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వెంకటేష్ పొలంలో వరి పంట నూర్పిడి చేసేందుకు అద్దెకు నూర్పిడియంత్రాన్ని తీసుకువచ్చాడు. వెంకటేష్ భార్య హంస(50) తల వెంట్రుకలు ఆ యంత్రంలో చిక్కుకోవడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను బయటికి తీసి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వరసిద్ధునికి భక్తుల తాకిడి

- నిత్యం 25 వేలకు పైగా వస్తున్న యాత్రికులు
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు



ఆలయంలో భక్తులతో కిక్కిరిసిన క్యూ

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. నిత్యం 25వేల మందికి పైగా తరలివస్తున్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో రద్దీ కొనసాగుతోంది. వినాయక నామస్మరణలతో ఆలయం మార్మోగుతోంది. భక్తుల తాకిడి అనుగుణంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో శని, ఆదివారాల్లో కాణిపాకం ఆలయం భక్తులతో కిక్కిరిసింది. సుమారు 30వేల మందికి పైగా స్వామిని దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

రోజురోజుకూ పెరుగుతూ..

రెండేళ్ల క్రితం వరకు నిత్యం స్వామివారి దర్శనానికి విచ్చేసే భక్తుల సంఖ్య 5వేల నుంచి 8వేలు మాత్రమే ఉండేది. ఆలయ జీర్ణోద్ధరణ తర్వాత భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వచ్చింది. వేసవి సెలవుల కారణంగా ఇప్పుడు శని, ఆదివారాల్లో 28వేలు దాటుతోందని అధికారులు చెబుతున్నారు. ఈ సమయంలో సర్వదర్శనానికి 4 నుంచి 5 గంటలు పడుతోందని వివరిస్తున్నారు.

పక్కాగా వసతులు

వేసవి నేపథ్యంలో ఎండ కారణంగా భక్తులు ఇబ్బంది పడకుండా అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆలయ ప్రాంగణంలోని రోడ్లపై కూలింగ్ పెయింట్ వేయించారు. దారి పొడవునా పందిళ్లతో నీడ కల్పించారు. అప్పుడప్పుడు నీళ్లతో రోడ్లను తడుపుతున్నారు. చల్లటి తాగునీటి వసతిని కల్పించారు. ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. దీంతో భక్తులకు ఎండ నుంచి కాస్త ఉపశమనం లభిస్తోంది. ఆలయ లోపల భాగంలోని క్యూల్లో సైతం అదనంగా ఫ్యాన్లు బిగించారు. దీంతోపాటు కూలర్లు ఏర్పాటు చేయడం విశేషం.